సాక్షి
నాగర్‌కర్నూల్

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024

గరిష్టం/కనిష్టం
34.5 /21.5

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఎండ ప్రభావం ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

దుర్గాదేవిగా వాసవీమాత



జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో గురువారం వాసవీమాతను దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో చండీహోమం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డా. స్వరాజ్యలక్ష్మి దంపతులు యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

– నాగర్‌కర్నూల్ రూరల్

న్యూస్‌రీల్

కొల్లాపూర్ ఇన్‌చార్జి ఆర్డీఓగా యాదగిరి



కొల్లాపూర్: పాలమూరు ప్రాజెక్టు భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న యాదగిరికి కొల్లాపూర్ ఆర్డీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కొల్లాపూర్ ఆర్డీఓగా పనిచేసిన పి.నాగరాజు ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి ఆర్డీఓగా యాదగిరిని నియమిస్తూ.. రెవెన్యూ శాఖ ఉన్న తాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌చార్జి ఆర్డీఓను డివిజన్‌లోని రెవెన్యూ ఉద్యోగులు శాలువా, పూలమాలలతో సత్కరించారు.


జూనియర్ అసిస్టెంట్‌పై వేటు

కొల్లాపూర్ ఆర్డీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొండల్‌రావుపై వేటు పడింది. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే కారణంతో ఆయనను విధుల నుంచి తప్పిస్తూ.. కలెక్టర్ సంతోష్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ జిల్లాకు చెందిన కొండల్‌రావు.. 98 జీఓ ప్రకారం ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరారు. కొల్లాపూర్‌లో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటైన కొత్తలో ఆయన భూసేకరణ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా అతడిపై చర్యలు తీసుకున్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రమైన నాగర్‌కర్నూల్ మున్సిపల్ కార్మికులు గురువారం పురపాలిక మేనేజర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు మాట్లాడుతూ.. 2022 డిసెంబర్‌లో అప్పటి ప్రభుత్వం కార్మికులకు వేతనాలు పెంచిందని, నాటి నుంచి ఏరియర్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న కార్మికులకు సైతం ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక యూనియన్ అధ్యక్షుడు భీముడు తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు కృషి



కొల్లాపూర్: దేశ సమైక్యతను కాపాడటంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర ఎనలేనిదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ బి.ఆంజనేయులు అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ పథసంచాలన్, విజయదశమి వేడుకల్లో భాగంగా గురువారం పట్టణంలో కరసేవకులు ప్రదర్శన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హిందుత్వ వాదంతో ముందుకు సాగుతున్న కరసేవకుల సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో కట్టా నరేందర్‌రెడ్డి, మేకల విజయ్‌యాదవ్, పురేందర్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ అంతంతే..



44,054 దరఖాస్తులకు 1,807 మాత్రమే పరిశీలన

- జిల్లాలో మందకొడిగా సాగుతున్న ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ
- ఇప్పటి వరకు 443 మందికి గ్రీన్ సిగ్నల్
- పెండింగ్‌లో 42,240 దరఖాస్తులు
- ప్లాట్ల యజమానులు ఆసక్తి చూపకపోవడమే కారణమంటున్న అధికారులు



అచ్చంపేటలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల ప్లాట్లను పరిశీలిస్తున్న అధికారులు

అచ్చంపేట: జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరిస్తామని ప్రభుత్వం ముందుకొచ్చినా.. యజమానులు ఆసక్తి చూపడం లేదు. మీ ఓపెన్ ప్లాట్ ఎక్కడుంది? సరైన లొకేషన్ దొరకడం లేదు? చూపించేందుకు వస్తారా అని సంబంధిత అధికారులు యజమానులను సంప్రదిస్తే.. కొందరు ఇప్పుడు అందుబాటులో లేమని.. మరికొందరు తర్వాత వచ్చి చూపిస్తామనే సమాధానం చెబుతున్నారు. ఇంకొందరు ఫోన్‌కాల్ రిసీవ్ చేసుకోవడం లేదని క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లిన అధికారులు పేర్కొంటున్నారు.

ఆదాయం అనుమానమే..

రాష్ట్ర ప్రభుత్వం 2020 ఆగస్టు 28వ తేదీ వరకు ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశమిచ్చింది. కానీ అప్పట్లో ప్రక్రియ ముందుకు సాగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఆగస్టు 1వ తేదీ నుంచి మళ్లీ ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను కొనసాగిస్తోంది. అయితే గతంలో మాదిరిగా కాకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రధానంగా దరఖాస్తుదారుడు కొనుగోలు చేసిన స్థలం పట్టా, ప్రభుత్వ భూమా లేదా.. ఏదేని చెరువు, కుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉందా? అనే అంశాలతో పాటు ఆ ప్లాట్‌కు సంబంధించిన లింక్ డాక్యుమెంట్లను మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. కాగా, ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ప్రారంభించి నాలుగేళ్లు కావడంతో ఇప్పటికే సగం మంది ఓపెన్ ప్లాట్లను ఇతరులకు విక్రయించినట్లు భావిస్తున్నారు. మరికొందరు ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టారు. జిల్లాలోని అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి మున్సిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకున్న ఓపెన్ ప్లాట్లలో ఇళ్లు దర్శనమిస్తున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న రూ. 200 కోట్లకు పైగా ఆదాయం రావడం అనుమానమేనని భావిస్తున్నారు.

సక్రమంగా ఉంటేనే అనుమతి..



ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి స్థలాలను మూడు శాఖల అధికారులు విజిట్ చేస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉంటేనే అనుమతులు ఇస్తున్నాం. లేకుంటే తిరస్కరిస్తున్నాం. అచ్చంపేటలో ఇప్పటి వరకు 240 దరఖాస్తులను పరిష్కరించాం. ఏడు అర్జీలను తిరస్కరించాం. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన సమయంలో ఓపెన్ ప్లాట్లలో చెట్లపొదలు ఉన్నాయి. దరఖాస్తుదారులు ప్లాట్ జియో కోఆర్డినేట్స్ నిక్షిప్తం చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– శ్యాంసుందర్, మున్సిపల్ కమిషనర్, అచ్చంపేట

జిల్లాలో మున్సిపాలిటీల వారీగా ఇలా..

మున్సిపాలిటీ	దరఖాస్తులు	ఓకే చేసినవి	తిరస్కరణ	పెండింగ్
నాగర్‌కర్నూల్	16,014	56	972	14,986
అచ్చంపేట	11,978	240	07	11,731
కల్వకుర్తి	11,497	122	392	10,983
కొల్లాపూర్	4,565	25	02	4,540
మొత్తం	44,054	443	1,364	42,240

5 శాతం దరఖాస్తుల పరిశీలన మాత్రమే పూర్తి..

లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) ప్రక్రియ పకడ్బందీగా కొనసాగుతోంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, అన్ని సక్రమంగా ఉంటేనే దరఖాస్తు దారులకు ఓకే చెబుతున్నారు. రెండు నెలల క్రితం ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ప్రారంభం కాగా.. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 44,054 దరఖాస్తులు పరిశీలనకు వచ్చాయి. అయితే ఇప్పటి వరకు సుమారు 1,807 దరఖాస్తులకు సంబంధించిన ప్లాట్లను మాత్రమే అధికారులు విజిట్ చేశారు. అందులో 443 దరఖాస్తులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 1,364 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఇంకా 42,242 మంది దరఖాస్తుదారుల ప్లాట్లను విజిట్ చేయాల్సి ఉంది. కాగా, మూడు నెలల్లో ప్రక్రియ పూర్తిచేసి, ప్రభుత్వానికి నివేదిక పంపాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నట్లు ఓ ఉన్నతాధికారి తెలిపారు. కానీ ఇప్పటి వరకు కేవలం 5శాతం దరఖాస్తుల పరిశీలన మాత్రమే పూర్తయింది.

- హైదరాబాద్‌లో చెరువులు, కుంటలతో పాటు నాలాలను ఆక్రమించి నిర్మించిన భవనాలను నేలమట్టం చేస్తున్న నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. క్షేత్రస్థాయిలో ప్లాట్లకు సంబంధించి సమగ్ర వివరాలు సేకరిస్తున్నారు. అందుకు సంబంధించిన పూర్తి హక్కులను కలెక్టర్‌కు ఇవ్వడంతో, ఆయన సైతం క్షేత్రస్థాయిలో ప్లాట్లను పరిశీలిస్తున్నారు.

డిజిటల్ కార్డుల సర్వేకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను ప్రామాణికంగా తీసుకొని అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో సర్వే ప్రక్రియ నిర్వహించేందుకు అధికారులు సంసిద్ధం కావాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు కె.సీతారామారావు, దేవ సహాయంలతో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన సర్వేను పకడ్బందీగా పూర్తిచేసినట్లు చెప్పారు. సర్వే వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో నిర్వహించే కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధం కావాలని సూచించారు. అనంతరం సర్వేకు సంబంధించిన వివరాల నమోదు తదితర అంశాలపై కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం చేయరాదు..

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని.. వైద్యసేవల్లో నిర్లక్ష్యం చేయరాదని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దముద్దునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. ఫార్మసీలో మందుల నిల్వ తదితర వివరాలను తెలుసుకున్నారు. ప్రసవాల సంఖ్య, వ్యాక్సినేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే వైద్యసేవలపై ఆశావర్కర్లు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

పాల బిల్లుల కోసం రైతుల ఆందోళన

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన విజయ డెయిరీ పాడి రైతులు గురువారం పాల బిల్లుల కోసం వెల్దండ పాలశీతలీకరణ కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. పండగకు పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో రెండు పాల కేంద్రాలు ఉండటంతో సమస్య తలెత్తిందని ఆరోపించారు. విషయం తెలుసుకున్న పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ ప్రియాంక పాల కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. మొదటి కేంద్రానికి చెందిన రైతులకు రూ. 3.30 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల కేంద్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, శేఖర్, పర్వతాలు, లక్ష్మీనారాయణ, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పతకాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్‌లో ఈ నెల 7, 8 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈ పోటీల్లో క్రీడాకారులు రెండు బంగారు, ఐదు కాంస్య పతకాలు సాధించి సత్తాచాటారు. గురువారం జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్పీ వెంకటేష్, కురుమూర్తిగౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి పుట్టి సురేష్‌చందర్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్‌లు సాధిక్‌అలీ, సునీల్‌కుమార్, అథ్లెటిక్స్ సంఘం సభ్యులు పి.శ్రీనివాసులు, రాజు, పి.శ్రీనివాస్, ధర్మేందర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు

అండర్– 18 విభాగం 200 మీటర్ల పరుగులో కె.శివకుమార్ బంగారు, అండర్– 20 విభాగం డెకాథ్లాన్‌లో బి.జ్ఞానేశ్వర్‌రెడ్డి బంగారు, అండర్– 20లో 5000 మీ., 10000 మీటర్ల పరుగులో కె.శివ కాంస్య పతకాలు, అండర్– 18లో లాంగ్‌జంప్‌లో కె.కార్తీక్ కాంస్య, అండర్– 18లో 110 హార్డిల్స్‌లో బి.శ్రీధర్ కాంస్య, అండర్– 18 విభాగం 3000 మీటర్ల పరుగులో పూజ కాంస్య, అండర్– 18 డిస్కస్‌త్రోలో బి.పౌర్ణమి కాంస్య పతకాలు సాధించారు.



అథ్లెటిక్స్ క్రీడాకారులతో క్రీడాసంఘాల ప్రతినిధులు



కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కలెక్టరేట్‌లో పూలసింగిడి

- అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు
- ఆటపాటలతో మార్మోగిన కలెక్టరేట్





బతుకమ్మను ముస్తాబు చేస్తున్న మహిళ

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లావ్యాప్తంగా గురువారం సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో మహిళలు బతుకమ్మలను పేర్చిన అనంతరం పసుపుతో తయారుచేసిన గౌరమ్మ ప్రతిమను బతుకమ్మల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, యువతులు పాటలు పాడుతూ.. బతుకమ్మ ఆడారు. సమీకృత కలెక్టరేట్ ఆవరణలో సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కలెక్టర్ బదావత్ సంతోష్ పాల్గొని బతుకమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. బతుకమ్మ ఆటపాటలతో కలెక్టరేట్ మార్మోగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బతుకమ్మల ఆటపాటలకు ప్రకృతి సైతం పరవశిస్తుందన్నారు. తెలంగాణ సంస్కృతి, ఆడపడుచుల ఔన్నత్యానికి బతుకమ్మ పండగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

శాంతిభద్రతల పరిరక్షణలో ఆయుధాలు ముఖ్యం



ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం: శాంతి భద్రతల పరిరక్షణలో ఆయుధాలు ఎంతో ముఖ్యమని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. గురువారం దుర్గాష్టమిని పురస్కరించుకొని జిల్లా సాయుధ బలగాల కార్యాలయంలో ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశ రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా దుష్టసంహారం కోసం ఆయుధాలు వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఆయుధాలు, సమస్త యంత్రాల్లో అంతర్లీనంగా దుర్గాదేవి చైతన్యశక్తి స్వరూపిణిగా ఉంటుందన్నారు. అందుకోసమే దుర్గాష్టమి రోజున ఆయుధ పూజ నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయుధాలను దుర్వినియోగపరచకూడదన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రామేశ్వర్, ఏఆర్ ఏఎస్పీ భరత్ కుమార్, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కనకయ్య గౌడ్, ఎస్‌ఐ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

నాగర్‌కర్నూల్ క్రైం: యువత మానసిక వైకల్యం బారిన పడేందుకు ముఖ్యకారణం మత్తు పదార్థాలకు బానిస కావడమేనని సీనియర్ సివిల్‌జడ్జి సబిత అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. మత్తు పదార్థాలతో మెదడు దెబ్బతిని మానసిక వైకల్యానికి దారితీస్తుందన్నారు. మత్తులో మానసిక విచక్షణ కోల్పోయి తోటి వారితో ఘర్షణలు, లైంగిక వేధింపులు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని అన్నారు. విద్యార్థులు, యువత నడవడికపై కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కుటుంబంలో ఒకరి సమస్యలను మరొకరితో పంచుకుంటే మానసిక సంతృప్తి కలగడంతో పాటు సమస్యలు దూరమవుతాయని తెలిపారు. జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రఘు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.వెంకటదాసు, మానసిక వైద్యుడు అంబుజ, న్యాయవాదులు శ్యాంప్రసాద్‌రావు, రాంబాబు, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి సబిత

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రాథమిక స్థాయిలోనే మానసిక సమస్యలను నివారించవచ్చని.. వ్యక్తుల ప్రవర్తనలో మార్పులను గమనించి, చికిత్స చేయించడంలో కుటుంబ సభ్యుల పాత్ర ముఖ్యమని డీఎంహెచ్‌ఓ డా.స్వరాజ్యలక్ష్మి అన్నారు. మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. మానసిక ఒత్తిడిని జయించేందుకు మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, ప్రోగ్రాం అధికారులు రవికుమార్ నాయక్, శ్రీనివాసులు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మైలారం గుట్ట పరిరక్షణకు ఉద్యమం



మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

బల్మూర్: మైలారం గుట్ట పరిరక్షణకు ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమిద్దామని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. పౌరహక్కుల సంఘం నాయకుల బృందం గురువారం బల్మూర్ మండలంలోని మైలారం గుట్టపై మైనింగ్ తవ్వకాలను పరిశీలించింది. అంతకుముందు గ్రామస్తులతో సమావేశమై గుట్టపై తవ్వకాల అనుమతులకు దారితీసిన పరిస్థితులు, తవ్వకాలతో గ్రామస్తులు, పర్యావరణానికి జరిగే నష్టాన్ని తెలుసుకున్నారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ.. మైలారం గుట్టపై మైనింగ్‌కు అనుమతులతో గ్రామస్తులకు జీవన్మరణ సమస్య ఏర్పడిందన్నారు. 50 శాతం ఇళ్లు గుట్టపైనే ఉన్నాయని.. గుట్ట విధ్వంసంతో గ్రామస్తులు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. ప్రభుత్వం గ్రామస్తుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, కేవలం మాజీ సర్పంచులు ఇచ్చిన తప్పుడు తీర్మానాలతో అనుమతులివ్వడం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడటమేనని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు దాసోహమై పనిచేయడం మానుకోవాలన్నారు. ప్రజా సంక్షేమం, రాజ్యాంగాన్ని మరిచి ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడం దుర్మార్గమైన చర్యన్నారు. మైలారం గుట్టపై తవ్వకాలతో పర్యావరణం నాశనం కావడంతో పాటు గ్రామస్తుల్లో జన్యుపరమైన లోపాలు ఏర్పడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తమ సంఘం ఆధ్వర్యంలో న్యాయపరంగా పోరాటం సాగించడంతో పాటు ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు, సహాయ కార్యదర్శి తిరుమలయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుభాన్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు రమేష్ చందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలయ్య, రాములు, వెంకటేష్, మహేష్, రాజు, మాజీ సర్పంచులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, బంగారయ్య, సత్యంగౌడ్ దేవస్వామి పాల్గొన్నారు.


గద్వాలలోని జములమ్మ ఆలయంలో..


కొత్తకోటలోని భవానీమాత ఆలయంలో...


కల్వకుర్తిలోని వాసవీమాత..


దేవరకద్ర మండలం లక్ష్మీపల్లిలో..


వడ్డేపల్లి మండలం శాంతినగర్‌లో ...


పాలమూరు ద్వారకామాయి ఆలయంలో..

శక్తి స్వరూపిణి దుర్గాదేవి

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. దుర్గతులను నివారించే పరాశక్తి గురువారం ఎనిమిదో రోజు వివిధ ఆలయాల్లో దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోటి సర్యప్రభలతో వెలిగొందే అమ్మవారిని పూజిస్తే శత్రుపీడనం తొలిగిపోయి.. సర్వత్రా విజయం ప్రాపిస్తుందని భక్తుల విశ్వాసం.

– సాక్షి నెట్‌వర్క్

మహాగౌరి.. సర్వ శుభంకరి

- జోగుళాంబ క్షేత్రంలో వైభవంగా శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- ఆలయాలను దర్శించుకున్న పలువురు ప్రముఖులు


జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ క్షేత్రంలో దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం జోగుళాంబ అమ్మవారు నవదుర్గాలలో ఒకరైన మహాగౌరిగా దర్శనమిచ్చారు. పరమేశ్వరుడిని పతిగా పొందడానికి అమ్మవారు కఠినమైన తపస్సు ఆచరించారని.. నాలుగు భుజాలతో అభయ, వరద హస్తాలను కలిగి, త్రిశూలం, డమరుకాలను ఆయుధాలుగా కలిగి ఉంటుందని అర్చకులు వివరించారు. భక్తుల కల్మశాలను తొలగించే కల్పవల్లిగా అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తారన్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి సన్నిధిలో కుమారి, సువాసిని పూజలు నిర్వహించారు. జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను భక్తుల దర్శనార్థం పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ గుమ్మడికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు.

■ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ హైకోర్టు జడ్జి వేణుగోపాల్, ఎస్పీ తోట శ్రీనివాసరావు, ఏపీ మాజీ సీఎస్ ఏకే గోయల్, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ఆలయ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈఓ, ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు.


హైకోర్టు జడ్జి వేణుగోపాల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ పురేందర్ కుమార్


చిన్నారుల నృత్య ప్రదర్శన

మహాచండీగా పర్వతాపూర్ మైసమ్మ


మహాచండీ రూపంలో పర్వతాపూర్ మైసమ్మ

నవాబుపేట: పర్వతాపూర్ మైసమ్మ దేవత గురువారం మహాచండీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారి మధనేశ్వర్‌రెడ్డి, ప్రధాన పూజారి శ్రీకాంత్‌శర్మ, అనసూయ, గోపాల్, మల్లేష్, నరేందర్, శ్రీనివాసాచారి, వెంకటేష్, గోవర్ధన్, శ్రీను, నర్సింహులు పాల్గొన్నారు.

అంధత్వాన్ని జయించి.. ఉపాధ్యాయులయ్యారు


ఉపాధ్యాయ నియామక పత్రంతో విష్ణు


బొంగు రమేష్

కొత్తకోట/వనపర్తి రూరల్: అన్నీ ఉన్నా అనుకున్న లక్ష్యం సాధించలేక మదనపడుతున్న యువకులను ఎంతో మందిని చూస్తున్నాం. కానీ పుట్టుక నుంచి అంధత్వం ఉన్న ఇద్దరు యువకులు పట్టుదలతో చదువులో రాణించి, ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. కొత్తకోట మండలం ముమ్మళ్లపల్లికి చెందిన సంజీవయ్య – సునీత కుమారుడు ఎం.విష్ణు, అతడి సోదరి నాగమ్మకు కళ్లు లేవు. తమ్ముడు సురేష్ పదోతరగతి వరకు చదువుకుని వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. విష్ణుకు చదువుపై ఉన్న మక్కువను గుర్తించిన తల్లిదండ్రులు.. మహబూబ్‌నగర్‌లోని అంధత్వ పాఠశాలలో చేర్పించారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు అక్కడే చదువుకున్న విష్ణు.. మహబూబ్‌నగర్‌లోనే డిగ్రీ పూర్తి చేశారు. హైదరాబాద్‌లో బీఎడ్, ఎంఏ తెలుగుతో పాటు పీహెచ్‌డీ పూర్తి చేశారు. సర్కారు కొలువు సాధించాలనే పట్టుదలతో ఉన్న విష్ణు.. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, స్కూల్ అసిస్టెంట్‌గా నియమితులై అందరికీ ఆదర్శంగా నిలిచారు.

■ పెబ్బేరు పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన మరో అంధ విద్యార్థి బొంగు రమేష్ డీఎస్సీలో ప్రతిభ కనబర్చి, ఎస్జీటీ విభాగంలో ఉద్యోగం సాధించారు. అతడి తల్లిదండ్రు లు గతంలోనే చనిపోగా.. అంధుల పాఠశాలలో పట్టుదలతో చదువుకొని ప్రభుత్వ కొలువు కొట్టారు. చదువుకు వికలత్వం అడ్డుకాదని రమేష్ నిరూపించారు.

‘ఈడబ్ల్యూఎస్ అందరికీ వర్తింపజేయాలి’


మాట్లాడుతున్న బూర్గుపల్లి కృష్ణయాదవ్

నారాయణపేట: ఆర్థికంగా వెనుకబడ్డ అన్ని కులాలకు 10 శాతం రిజర్వేషన్లు అందించాలని.. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని బీసీ జాగృతిసేన వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ హెచ్చరించారు. గురువారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా అగ్రకులాల వారు ఏడు శాతానికి మించి లేరని.. అందులో రెండు శాతానికి మించి పేదలు లేరని, విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు ఎలా కేటాయిస్తారని మండిపడ్డారు. పోటీ పరీక్షల్లో ఎక్కువ మార్కులు వచ్చిన బీసీ అభ్యర్థుల కంటే తక్కువ మార్కులు వచ్చిన అగ్రకులాలకు ఉద్యోగాలు లభించాయని తెలిపారు. తమిళనాడు, బిహార్‌లో ఈడబ్ల్యూఎస్ అమలు చేయడం లేదని తెలంగాణాలో సబ్బండ కులాల జనగణన చేపట్టి దామాషా ప్రకారం అన్ని సామాజికవర్గాల ప్రజలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. 50 ఏళ్లుగా బీసీ కులగణన చేపట్టాలని, విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, రాజకీయ పారిశ్రామిక రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని దేశవ్యాప్తంగా నినదిస్తున్నా పట్టించుకోని కేంద్రం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ 10 శాతం ఎలా కల్పిస్తోందని ప్రశ్నించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు కుర్మయ్య, ఉపాధ్యక్షులు గణేష్, ఆనంద్‌కుమార్, నగేష్, పొన్నయ్య, బాలరాజు, భీంరాజ్, వెంకటేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీ.. వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: పట్టాలు దాటుతున్న వ్యక్తిని..రైలు వేగంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని అప్పన్నపల్లికి చెందిన శ్రీనివాసులు(52) గురువారం ఉదయం అప్పన్నపల్లి సమీపంలో రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో డెమో రైలు ఢీకొట్టింది. దీంతో అతని శరీరం పూర్తిగా నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఒంటరిగా ఉంటూ మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. మృతదేహం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

పాముకాటుతో యువకుడు..


లక్ష్మన్న (ఫైల్)

అయిజ: పాముకాటుతో విద్యార్థి మృతి చెందిన సంఘటన గద్వాల జిల్లా అయిజ మండలంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన కథనం ప్రకారం.. మేడికొండ గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులు కుమారుడు లక్ష్మన్న (25) డిగ్రీ పూర్తి చేసుకొని హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటున్నాడు. దసరా పండుగకు సొంత గ్రామానికి వచ్చిన లక్ష్మన్న బుధవారం సొంత పొలంలో పని చేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. గురువారం వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

పిడుగుపాటుతో భార్యాభర్తలకు గాయాలు

పాన్‌గల్: పిడుగుపాటుతో భార్యాభర్తలు గాయపడిన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని దావాజిపల్లికి చెందిన స్వామి, దివ్య భార్యాభర్తలు. గురువారం తమ వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో వారు సమీపంలోని చెట్టు కిందకు వెళ్లగా అదే సమయంలో సమీపంలో పిడుగు పడటంతో స్వామి కాళ్లు, తొడకు, దివ్యకు రెండు కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే ఇరువురిని జిల్లాకేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

లైంగిక దాడికి పాల్పడి.. హతమార్చి

- మహిళ మృతి కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడికి రిమాండ్

వనపర్తి రూరల్: వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన మహిళ కేసును పోలీసులు ఛేదించారు. సదరు మహిళపై లైంగిక దాడికి పాల్పడి హతమార్చిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ జలేందర్‌రెడ్డి వివరాల మేరకు.. గోపాల్‌పేట మండలం ధర్మాతండా (పాటిగడ్డ తండా)కు చెందిన పాత్లావత్ శాంతమ్మ (40) కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేది. ఈ నెల 8న మధ్యాహ్నం కూరగాయల కోసం వనపర్తికి వచ్చింది. అయితే వనపర్తి పట్టణంలోని తిరుమల కాలనీలో నివాసముంటున్న నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లికి చెందిన బత్తిని ప్రభాకర్ స్థానిక గాంధీ చౌక్‌లో కూరగాయలు కొంటున్న శాంతమ్మతో మాటలు కలిపాడు. ఆమెను ఎలాగైనా అనుభవించాలన్న ఉద్దేశంతో డబ్బు, మద్యం ఆశ చూపాడు. ఈ క్రమంలో ఆమెతో మద్యం తాగించి, బైక్‌పై ఎక్కించుకొని చిమనగుంటపల్లి గ్రామ శివారుకు చేరుకొని లైంగిక దాడికి పాల్పడ్డాడు. సదరు మహిళకు ఇచ్చేందుకు అతడి వద్ద డబ్బు లేపోవడంతో పక్కనే వ్యవసాయ బావిలోకి తోసేశాడు. ఆ తర్వాత ఆమెను నీటిలో తొక్కిపట్టాడు. ఆమె మృతిచెందిన తర్వాత అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే ఘటనా స్థలంలో దొరికిన నిందితుడి ఆధార్ కార్డు, బైక్ ఆర్సీ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. వనపర్తిలో బత్తిని ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించడంతో నేరం ఒప్పుకున్నాడు. అతడిని కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


క్షతగాత్రుడిని కారులో ఎక్కిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యే

మక్తల్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో ఒకరు గాయాలపాలైన ఘటన పట్టణ సమీపంలోని చెరువుకట్ట దగ్గర గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని బొందలకుంటకు చెందిన ప్రవీణ్‌కుమార్ వ్యక్తిగత పని నిమిత్తం మక్తల్‌కు వచ్చారు. తిరిగి గ్రామానికి వెళ్తుండగా చెరువుకట్ట సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి. అదే సమయంలో హైదరాబాద్ నుంచి మక్తల్‌కు వస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తన వాహనం ఆపి రోడ్డుపై పడి ఉన్న ప్రవీణ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

కారు దగ్ధం.. తప్పిన పెను ప్రమాదం


ప్రమాదంలో దగ్ధమవుతున్న కారు

మాగనూర్: ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డు పక్కన చెట్టును కారు ఢీకొని పూర్తిగా దగ్ధమైన ఘటన గురువారం తెల్లవారుజామున మండల కేంద్రం సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అశోక్‌బాబు కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేటకు చెందిన శ్రీనివాసరావు తన భార్య, తల్లి, అత్త, ముగ్గురు పిల్లలతో కలిసి మంత్రాలయంలోని రాఘవేంద్రస్వామి దర్శనానికి బుధవారం కారులో బయలుదేరారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో మండల కేంద్రం సమీపంలోని రోడ్డు క్యాంపు వద్ద ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి పక్కనే ఉన్న చెట్టును కొట్టాడు. వెంటనే కారులో ఉన్న వారంతా బయటకు దిగగా మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు తల్లికి స్వల్ప గాయాలుకాగా వెంటనే మక్తల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స పొందించారు. రహదారి పక్కనున్న వారు డయల్ 100కు సమాచారం ఇవ్వగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక యంత్రాన్ని పిలిపించి మంటలను అదుపుచేశారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

జాతీయ రహదారిపై కంటైనర్..


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జడ్చర్ల: మండలంలోని మల్లెబోయిన్‌పల్లి శివారులో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి భారీ కంటైనర్ అగ్ని ప్రమాదానికి గురైంది. కర్ణాటక నుంచి ఉత్తరాఖండ్‌కు ఆటోమొబైల్స్ విడిభాగాలను తరలిస్తున్న లారీ కంటైనర్ వెనక భాగంలో ఒక వైపు టైరు అకస్మాత్తుగా పేలిపోయి మంటలు చెలరేగాయి. వెంటనే డ్రైవర్ అప్రమత్తమై లారీని పక్కకు నిలిపివేసి అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసి లొకేషన్ చెప్పాడు. దీంతో జడ్చర్ల అగ్నిమాపక సిబ్బంది హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. అయితే మంటలు డీజిల్ ట్యాంకుకు చేరుకునే పరిస్థితికి ముందే ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పిపోయిందని సిబ్బంది తెలిపారు.

లారీ, బొలెరో ఢీ : ఏడుగురికి గాయాలు

జడ్చర్ల: వ్యవసాయ పనులకు కూలీలను తరలిస్తున్న బొలెరో వాహనం, లారీ ఢీకొనడంతో పలువురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. భూత్పూర్ మండలం అమిస్తాపూర్‌కు చెందిన 15 మంది కూలీలు గురువారం జడ్చర్ల మండలం గంగాపూర్ శివారులో కలుపుతీత పనులకు బొలెరో వాహనంలో వెళ్లారు. పని ముగించుకొని తిరిగి వస్తుండగా.. జడ్చర్ల-గంగాపూర్ ప్రధాన రహదారిపై ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో లింగమ్మ కాలు విరగగా, శ్రీనివాస్ తలకు గాయమైంది. అదేవిధంగా శిరీష, ఫరీదాబేగం, కొండమ్మ, లక్ష్మమ్మ, డ్రైవర్ వెంకటేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో ఏనుగొండ ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు..

జడ్చర్ల: మండలంలోని బూరెడ్డిపల్లి శివారు జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం రాజాపూర్‌కు చెందిన విజయ, కృష్ణ బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. బూరెడ్డిపల్లి శివారులో కారు ఢీకొట్టడంతో గాయపడగా వెంటనే 108 వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గాయాలైన ఇద్దరు వ్యక్తులు మృతి

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామ శివారులో బుధవారం ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు వ్యక్తులు చికిత్సకు తరలించేలోపు మృతిచెందారు. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి కథనం ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా చెనుగోనిపల్లికి చెందిన 15 మంది బుధవారం ఆటోలో వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలోని ఓ గ్రామంలో పెళ్లి సంబంధం కుదుర్చుకొని వస్తున్నారు. ఈ క్రమంలో రంగాపురం గ్రామ శివారులో ఆటో అదుపు తప్పి బోల్తాపడటంతో బోయ మొద్దు చిన్నరాముడు(43), బోయ మునెన్న(68)లకు తీవ్ర గాయాలు కాగా.. అంబులెన్సులో కర్నూలు ఆస్పత్రి తరలించేలోగా మృతిచెందారు. ఈ ఘటనపై గురువారం బోయ వెంకటేష్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు

ధరూరు: మండలంలోని అల్వాలపాడుకు చెందిన సవారమ్మ (80) చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల వివరాల మేరకు.. ఈ నెల 3న పొలం వద్ద ఉన్న భర్త సవారన్నకు ఇంటి నుంచి భోజనం తీసుకుని వెళ్తుండగా.. కేటీదొడ్డి మండలం పాగుంటకు వెళ్తున్న బోయ స్వామి బైకుతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సవారమ్మను గద్వాలకు తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షుకూర్ తెలిపారు.

జూరాలకు స్వల్ప వరద

ధరూరు/ దోమలపెంట/ ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గినట్లు అధికారులు తెలిపారు. గురువారం రాత్రి 8 గంటలకు ప్రాజెక్టుకు 19,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. దీంతో విద్యుదుత్పత్తి నిమిత్తం 22,801 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,130, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు వదలగా.. మరో 119 క్యూసెక్కులు ఆవిరైంది. నెట్టెంపాడు ఎత్తిపోతలకు నీటి పంపింగ్ నిలిపివేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.296 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో 881.6 అడుగుల నీటిమట్టం

శ్రీశైలం జలాశయానికి ఎగువనున్న జూరాల, సుంకేసుల నుంచి కలిపి మొత్తం 31,759 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తుంది. దీంతో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,241 మొత్తం 65,556 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 10,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,561, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 1,600 క్యూసెక్కు లు వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 881.6 అడుగుల వద్ద 197.0114 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

జూరాల దిగువ, ఎగువ జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిర్విరామంగా కొనసాగుతుంది. గురువారం ఎగువలో 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, 254.347 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు ఉత్పత్తి చేపట్టామని ఎస్ఈ సూరిబాబు తెలిపారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటి వరకు 485.983 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామన్నారు.

లారీ ఢీ.. 70 గొర్రెలు మృతి


ప్రమాదానికి కారణమైన లారీ

దేవరకద్ర: లారీ ఢీ కొట్టడంతో 70 గొర్రెలు మృతి చెందిన సంఘటన గురువారంరాత్రి దేవరకద్ర మండలం పెద్ద గోప్లాపూర్ శివారులో జరిగింది. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం ముష్టిపల్లికి చెందిన కుర్వ వెంకటయ్య, పోలప్ప గొర్రెల మందను మేపు కొని తిరిగి తమ సొంత గ్రామానికి వెళుతుండగా పెద్ద గోప్లాపూర్ శివారులో వేగంగా వచ్చిన కేఏ 05 ఏకే 9383 నంబర్ గల లారీ గొర్రెల మందను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో గొర్రెల మందపై నుంచి లారీ వెళ్లడంతో 70 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. సంఘటన స్థలంలో రోడ్డంతా గొర్రెల మృతదేహాలతో రక్తసిక్తంగా మారింది. మరి కొన్ని గొర్రెలకు గాయాలయ్యాయి. ఈ సంఘటనతో ఇన్నాళ్లు కాపాడుకుంటూ వస్తున్న మందను లారీ మింగేసిందని గొర్రెల కాపారులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతి చెందిన గొర్రెల విలువ దాదాపు రూ.5లక్షల వరకు ఉంటుందని బాధితులు వాపోయారు. సమాచారం అందిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో వివరాలు సేకరించారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పొలంలో మొసలి

శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లికి చెందిన నర్సింహనాయుడి వ్యవసాయ పొలంలో గురువారం మొసలి కనిపించడంతో రైతులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరకొని తాళ్ల సాయంతో బంధించి కృష్ణానదిలో వదులుతామని ట్రాక్టర్‌లో తీసుకెళ్లారు.

– వనపర్తి రూరల్



టెక్...టాక్



రెడ్ మ్యాజిక్ టైటాన్ 16 ప్రో

రిజల్యూషన్: 2,560×1,600 పిక్సెల్స్
బరువు: 2.4 కేజీ;
రిఫ్రెష్‌రేట్: 240 హెచ్‌జెడ్
ఓఎస్: విండోస్ 11 హోమ్

శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్10 ప్లస్



డిస్‌ప్లే: 12.4 అంగుళాలు
మెమరీ: 12జీబీ ర్యామ్/256జీబీ/512 జీబీ స్టోరేజ్
కెమెరా: 13 ఎంపీ మెయిన్/ 8 ఎంపీ అల్ట్రా వైడ్/ 12 ఎంపీ ఫ్రంట్
బ్యాటరీ: 10,900 ఎంఏహెచ్



ల్యాప్‌టాప్ మౌంట్ మ్యాగ్-సేఫ్ ఫోన్

బ్రాండ్: ఇన్‌ఎవిట్
కలర్: బ్లాక్; స్పెషల్ ఫీచర్స్: ఆర్మ్
మౌంటింగ్ టైప్: టేబుల్ మౌంట్
బరువు: 100 గ్రా.
ప్రాడక్ట్ డైమెన్షన్స్: 13×5.6×0.5 సీఎం

మొబైల్ అండ్ ట్యాబ్‌లెట్ హోల్డర్



బ్రాండ్: అమెజాన్ బేసిక్స్
కలర్: బ్లాక్
ఫామ్ ఫ్యాక్టర్: టేబుల్ స్టాండ్
360 డిగ్రీ రొటేషన్ ఫీచర్
కంపాటబుల్ ఫోన్ మోడల్స్: ఆల్ ఫోన్స్

ఇంగ్లీష్ ఇడియమ్స్



ఎక్స్‌టెండ్ ది ఆలివ్ బ్రాంచ్

గొడవలు లేదా విభేదాలకు స్వస్తి పలకడానికి సుముఖతకు వ్యక్తం చేయడానికి, స్నేహపూర్వక హస్తాన్ని అందించి సామరస్యం దిశగా అడుగులు వేసేటప్పుడు వాడే మాట...ఎక్స్‌టెండ్ ది ఆలివ్ బ్రాంచ్.

ఉదా: డూరింగ్ నెగోషియన్స్, ఈచ్ సైడ్ టూక్ టర్న్స్ ఎక్స్‌టెండింగ్ ది ఆలివ్ బ్రాంచ్ టు ట్రై అండ్ రీచ్ ఏ కాంప్రమైజ్.

వానిష్ ఇన్ టు ది ఏయిర్

'ఒక్కసారిగా మాయమయ్యాడు' 'ఫైల్స్ ఉన్నట్టుండి మాయం అయ్యాయి'... ఇలా చెప్పే సందర్భంలో వాడే మాట... వానిష్ ఇన్ టు ది ఏయిర్.

ఉదా: మై కీస్ సీమ్ టు హ్యావ్ వానిష్డ్ ఇన్‌టు తిన్ ఏయిర్. ఐ హ్యావ్ సెర్చ్‌డ్ ఎవ్రీవేర్ అండ్ కాంట్ ఫైండ్ దెమ్.

ఇన్‌స్పిరేషన్

రుక్మిణి వారియర్



ఆరో తరగతి ఫెయిలైన అమ్మాయికి 'ఐఏఎస్' కలలు ఉంటాయా? 'సాధ్యం కాదు' అనుకున్నదాన్ని 'సాధ్యం' చేయవచ్చా? ఈ రెండు ప్రశ్నలకు జవాబు చెప్పే పేరు....రుక్మిణి రియర్. ఆరో తరగతి ఫెయిలైన రుక్మిణి తొలి ప్రయత్నంలోనే యూపీఎస్‌సీలో రెండో ర్యాంకు సాధించింది. ప్రస్తుతం రాజస్థాన్‌లోని జైపూర్ మున్సిపల్ కమిషనర్‌గా 'ఆఫీసర్ అంటే ఇలా ఉండాలి' అనుకునేలా పనిచేస్తోంది...

స్కూల్ రోజుల్లో రుక్మిణి బ్రైట్ స్టూడెంట్ కాదు. రుక్మిణి ఆరో తరగతి ఫెయిలైన్ కావడం ఎవరికీ పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. అయితే ఆ ఫెయిల్యూరే తనను సక్సెస్‌కు దగ్గర చేసింది.

'ఫెయిల్యూర్ అంటే మొదలైన భయం ఎలాగైనా సక్సెస్ కావాలనే పట్టుదలను పెంచింది' అంటుంది రుక్మిణి. అమృత్‌సర్‌లోని 'గురునానక్ యూనివర్శిటీ'లో సోషల్ సైన్స్‌లో డిగ్రీ చేసిన రుక్మిణి ముంబైలోని 'టాటా ఇనిస్టిట్యూట్'లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. ఆ తరువాత ముంబై, మైసూర్‌లలో కొన్ని స్వచ్ఛందసంస్థలలో పనిచేసింది.

స్వచ్ఛంద సంస్థల్లో పనిచేస్తున్న క్రమంలో అంకితభావం, వృత్తినిబద్ధత ఉన్న ఎంతో మంది ఐఏఎస్ అధికారుల గురించి విన్నది. వారి గురించి విన్నప్పుడల్లా 'ఐఏఎస్' వైపు మనసు మళ్లేది. చివరికది అది తన కలగా మారింది.

'ఒక ప్రయత్నం చేసి చూద్దాం' అని రంగంలోకి దిగింది. కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండానే తొలి ప్రయత్నంలోనే యూపీఎస్‌సీలో ఆల్ ఇండియా ర్యాంక్ 2 సాధించింది. 'ఆరోతరగతి ఫెయిలైన అమ్మాయి ఐఏఎస్ సాధించింది'... రుక్మిణి గురించి ఇలాంటి వార్తలు వైరల్ అయ్యాయి. చాలామంది విద్యార్థులు ఆమెను కలుసుకొని మాట్లాడి సలహాలు తీసుకునేవారు.

కట్ చేస్తే...

ఇప్పుడు రుక్మిణి రియర్ రాజస్థాన్‌లోని జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ కమిషనర్.

యూపీఎస్‌సీలో సెకండ్ ర్యాంక్‌తో ఎలా వార్తల్లో నిలిచిందో మున్సిపల్ కమిషనర్‌గా కూడా ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. దీనికి కారణం అక్రమార్కుల పాలిట ఆమె సింహస్వప్నం కావడమే. డిసెంబర్‌లో జరగబోయే 'రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'ను దృష్టిలో పెట్టుకొని విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. విమానాశ్రయం నుండి 22 గోదాముల వరకు ప్రధాన రోడ్లను పరిశీలిస్తూ వెళ్లింది.

నగర పరిశుభ్రత, సుందరీకరణ గురించి స్థానికులతో మాట్లాడింది. సమ్మిట్ ఏర్పాట్లను వేగవంతం చెయ్యాలని, పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఫ్లైవోవర్‌లు మరింత ఆకర్షణీయంగా కనిపించడానికి పెయింటింగ్, లైటింగ్‌ల కోసం సూచనలు ఇచ్చింది.

గోడలకు పెయింటింగ్ వేయడం నుంచి పబ్లిక్ టాయిలెట్లు, చెత్త కుండీలు శుభ్రం చేయడం వరకు ప్రతి పని దగ్గర ఉండి చేయిస్తుంది. నగర సుందరీకరణతో పాటు ఆక్రమణలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

'రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్' ద్వారా జైపూర్‌ను గ్లోబల్ సిటీగా ప్రదర్శించడానికి అవకాశం ఉంటుంది. దీని కోసం జైపూర్ అద్భుతంగా కనిపించకపోయినా... పరిశుభ్రంగా, ఆక్రమణలు లేకుండా కనిపించాలి. ఇది అనుకున్నంత సులువైన పనేమీ కాదు. ఎందుకంటే సమ్మిట్‌కు ఎన్నో నెలలు లేదు. అయినా సరే వెనక్కి తగ్గకుండా కష్టపడుతూ ప్రజల నుంచి శభాష్ అనిపించుకుంటోంది రుక్మిణి.

'పని చెయ్యకపోయినా ఫరవా లేదు. చేస్తే మాత్రం శ్రద్ధగా, భక్తిగా చేయాలి' అని అమ్మ అంటుండేది. ఆ మాటలే రుక్మిణి రియర్‌కు వేదవాక్కు.

ఏఐ ఏరియా



మెటా వారి మూవీ జెన్

'మూవీ జెన్' అనే కొత్త ఏఐ మోడల్‌ను రూపొందిస్తున్నట్లు టెక్ దిగ్గజం 'మెటా' ప్రకటించింది. ఇది ప్రాంప్ట్‌లకు స్పందనగా రియలిస్టిక్ వీడియో, ఆడియో క్లిప్‌లను జనరేట్ చేయగలదు. ఓపెన్ ఏఐ, ఎలెవన్ ల్యాబ్స్‌లాంటి ఏఐ వీడియో టూల్స్‌కు ఇది గట్టి పోటీ ఇవ్వగలదని పరిశీలకులు భావిస్తున్నారు. ఓపెన్ ఏఐ తన వీడియో మోడల్ 'సోరా'ను ప్రపంచానికి పరిచయం చేసింది. ఓపెన్ ఏఐ షేర్ చేసిన డెమోలు ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టించాయి.

'సోరా' ఇంకా అందుబాటులోకి రానప్పటికీ దాని హైపర్ రియలిస్టిక్ ఫుటేజ్ హాలీవుడ్ స్థాయిలో కనిపించింది. ఈ నేపథ్యంలో 'మూవీ జెన్' గురించిన సమాచారం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది టెక్స్ట్ ఇన్‌పుట్స్ సహాయంతో వీడియోలను జనరేట్ చేస్తుంది. ఫుటేజ్, స్టిల్ ఇమేజ్‌లను ఎడిట్ చేయగలదు. వీడియోకు జోడించే ఆడియో కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా జనరేట్ చేయబడుతుందని, విజువల్‌కు సింక్ అవుతుందని సమాచారం. వివిధ యాస్పెక్ట్ రేషియోలలో వీడియోలను రూపొందించడంతో పాటు వీడియోలకు నిర్దిష్ట సవరణలు చేయగలదు. యూజర్ అందించిన చిత్రాలను ఉపయోగించి పర్సనలైజ్ కంటెంట్‌ను సృష్టించగలదు. టెక్నికల్‌గా చూస్తే...'మూవీ జెన్' అనేది వీడియో జనరేషన్ కోసం 30 బిలియన్ పారామీటర్ మోడల్, ఆడియో కోసం 13 బిలియన్ పారామీటర్ మోడల్‌ను ఉపయోగిస్తుంది.

మెటా మాటల్లో చెప్పాలంటే 'మూవీ జెన్' అనేది అధునాతన ఏఐ వీడియో సృష్టి సాధనం.

గేమింగ్

మన దేశంలోని ప్రముఖ గేమింగ్ స్టూడియోలలో ఒకటైన 'అప్రెమింగ్' తన బ్యాటిల్ రాయల్ గేమ్ 'ఇండస్' లాంచ్ తేదీని ప్రకటించింది. ఈ నెల16 నుంచి గేమ్ సందడి మొదలు కానుంది. ఈ గేమ్ గూగుల్ ప్లేస్టోర్, ఐఓఎస్ యాప్ స్టోర్ ద్వారా ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ గేమ్‌లోని హీరో లక్ష్యం 'కాస్మియం' అని పిలవబడే అరుదైన వనరును సేకరించడం, తన ప్రత్యర్థి ప్రోశ్రాన్‌ను ఎదుర్కోవడం.



ఆయుధాల దండోర

'డోన్ట్ వేస్ట్ టైమ్...ఫినిష్ హిమ్' అంటూ వచ్చిన గేమ్ ట్రైలర్ ఆకట్టుకుంది. 'ఇండస్ ద్వారా మన భారతీయ సంస్కృతి, సంప్రదాయలలోని ప్రత్యేకమైన పాత్రలు, ఆయుధాలను ప్లేయర్స్ ముందుకు తీసుకువస్తున్నాం. బీటా దశలో ప్లేయర్స్ నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌తో గేమ్‌ను మరింత మెరుగు పరిచాం' అంటున్నాడు 'సూపర్‌గేమింగ్' సీయివో రోబీజాన్.

ప్లాట్‌ఫామ్స్: పీసి, మొబైల్, కన్సోల్; **జానర్:** బ్యాటిల్ రాయల్ గేమ్

మ్యూజిక్ వరల్డ్

ధీ ధీ తారా



'సౌత్ ఇండియన్ మ్యూజిక్ అంటే నాకు చాలా ఆసక్తి. పాటలు వింటాను. మ్యూజిక్ వీడియోలు చూస్తుంటాను' అంటున్న కొరియన్ ఆర్టిస్ట్ ఔర సింగర్-సాంగ్ రైటర్ శిరీష భాగవతులతో కలిసి 'ధీ ధీ తారా' (కుట్టనాడన్ డ్రీమ్స్) ఆలపించాడు. గత సంవత్సరం చివరిలో బిగ్‌బాస్ సీజన్ 17లో వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్‌గా కనిపించాడు. ఈ సంవత్సరం ప్రారంభంలో ఝలక్ దిఖ్లా సీజన్ 11లో కూడా కనిపించాడు. ఈ క్రమంలో ఇండియన్ మ్యూజిక్‌పై లవ్ పెంచుకున్నాడు.'ఛలో' 'రోకో'లాంటి పదాలు పలుకుతున్న ఔర హిందీ నేర్చుకోవాలనుకుంటున్నాడు.

'ఔరా ఉచ్చారణ చాలా భిన్నంగా ఉంటుంది. దీని కోసం ఐదు వారల పాటు పనిచేశాడు. అతడి అంకితభావం నాకు ఎంతగానో నచ్చింది' అంటున్న శిరీష ఔరాను మన దేశంలోని ఇంటిపేరుగా అభివర్ణించింది. 'మార్నింగ్ నూన్ ఈవెనింగ్' 'బ్లూ ఓషియన్' 'ఫైర్‌వర్క్'....ఇలాంటి ఎన్నో సింగిల్స్‌తో పేరు తెచ్చుకున్న ఔరా 2014లో బాయ్ బ్యాండ్ ఎఎతో కెరీర్ ప్రారంభించాడు.

సినిమా

నాలుగు దశాబ్దాలు వెనక్కి...


● రాజ్ తరుణ్, సందీప్

రాజ్ తరుణ్, సందీప్ మాధవ్ హీరోలుగా నటిస్తున్న యాక్షన్ చిత్రం 'రామ్ భజరంగ్'. సిమ్రత్ కౌర్, సత్నా టైటస్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయ్యింది. దసరా నవరాత్రుల సందర్భంగా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''ఈ చిత్రంలో రాజ్ తరుణ్, సందీప్ డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తారు. ఎందుకంటే దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం సాగే కథలో ఇద్దరూ నటిస్తున్నారు. ''1980 నేపథ్యంలో సాగే ఈ సినిమా మంచి ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. ఛాయా దేవి, మనసా రాధాకృష్ణన్, రాజా రవీంద్ర, రవిశంకర్, షఫీ, శివరామరాజు వెంకట్, 'సత్యం' రాజేశ్, ధనరాజ్, 'రచ్చ' రవి, ఐశ్వర్య ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: మణిశర్మ, కెమెరా: అజయ్ విన్సెంట్.


● అజిత్

సంక్రాంతి బరిలోనే...

అజిత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ స్పెయిన్‌లోని మ్యాడ్రిడ్‌లో జరుగుతోంది. ఈ లాంగ్ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్, సాంగ్ చిత్రీకరణలను కూడా ప్లాన్ చేశారు. ఈ చిత్రంలో సునీల్, ప్రసన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలాగే ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారని, హీరోయిన్ శ్రీలీల మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సంక్రాంతికి విడుదల కానుంది. అయితే ఈ సినిమాకన్నా ముందే అజిత్ హీరోగా కమిటైన 'విడాముయర్చి' చిత్రం సంక్రాంతికి విడుదలతుందని, 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వచ్చే వేసవిలో రిలీజ్ కానుందనే ప్రచారం తెరపైకి వచ్చింది. కానీ తాజాగా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సంక్రాంతికే రిలీజ్ అవుతుందని వెల్లడించి, అజిత్ కొత్త లుక్‌ను యూనిట్ రిలీజ్ చేసింది. దీంతో 'విడాముయర్చి' చిత్రం వచ్చే వేసవిలో రిలీజ్ అవుతుందని ఊహించవచ్చు.

ఓటీటీ ఇది చూడొచ్చు

బిడ్డ కోసం పోరాడిన ఓ కన్నతల్లి కథ

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'కిడ్నాప్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.


● 'కిడ్నాప్' పోస్టర్

ప్రపంచంలో తల్లి ప్రేమకు సాటి ఏదీ లేదని అంటారు. తన బిడ్డకు ఆపద వస్తే తన ప్రాణాన్ని పణంగా పెట్టైనా పోరాడే తత్వం తల్లిది అన్న విషయాన్ని సూటిగా చూపించిన ఆంగ్ల చిత్రం 'కిడ్నాప్'. 2017లో లూయి ప్రీటో దర్శకత్వంలో విడుదలైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలందుకుంది. హాలీవుడ్ ప్రముఖ కథానాయిక హేలీ బెర్రీ ప్రధాన పాత్రలో నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ (ఇంగ్లిష్), లయన్స్ గేట్ (తెలుగు వెర్షన్) ఓటీటీల్లో స్ట్రీమ్ అవుతోంది. తల్లిగా ఆమె నటన ఈ సినిమా మొత్తానికి హైలైట్. కథాంశానికొస్తే... కార్లా డైసన్ ఓ సింగిల్ మదర్. తన ఆరేళ్ల కొడుకు ఫ్రాంకీని కార్నివాల్‌కు తీసుకువెళ్ళడంతో 'కిడ్నాప్' సినిమా మొదలవుతుంది. కార్నివాల్‌లో అనుకోకుండా పార్కింగ్ లాట్ నుండి తన కొడుకును ఎవరో ఎత్తుకెళ్లడం చూస్తుంది కార్లా. ఇక అక్కడి నుండి ఆ కిడ్నాపర్ల వెంటపడి తన కొడుకును ఎలా కాపాడుకుంటుంది అన్నదే మిగతా కథ. ఈ సినిమా స్క్రీన్‌ప్లే దాదాపు రోడ్డు మార్గానే నడుస్తుంది. అమెరికా రోడ్లలో పరిమితికి మించి వేగంగా కొంతమంది కార్లు నడుపుతూ ఉంటారు. అంతకు మించి వేగంగా ఈ కథ స్క్రీన్‌ప్లే ఉంటుంది. కుర్చీలో కూర్చున్న ప్రేక్షకులు ఈ సినిమా మొదలయ్యాక శుభం కార్డు పడే వరకు లేవరు. సినిమాను అంత ఆసక్తికరంగా దర్శకుడు లూయీ రూపొందించారనడంలో అతిశయోక్తి లేదు. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని తీశారు. ప్రఖ్యాత సంస్థ అయిన ఎఫ్‌బీఐ ఇచ్చిన అంచనాల మేరకు అమెరికాలో ఏటా 8 లక్షలకు పైబడి ప్రతి 40 సెకన్లకు ఓ బిడ్డ కనిపించకుండాపోతున్న పరిస్థితి ఉంది. మనందరినీ మనకి తెలిసీ తెలియకుండా నిరంతరం కాపాడే అమ్మ ఆ విజయదుర్గ. ఆ తల్లి తత్వంతో తీసిన ఈ సినిమా నిజంగా అద్భుతం. విజయదశమి పండగ సమయంలో థ్రిల్లర్ జోనర్ ఇష్టపడే వాళ్లకి ఇదో మంచి చాయిస్.

– ఇంటూరు హరికృష్ణ

పవర్‌ఫుల్ ఝాన్సీ


● లక్ష్మీ రాయ్

లక్ష్మీ రాయ్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. గురు ప్రసాద్ దర్శకత్వం వహించారు. తమిళ, కన్నడ భాషల్లో ఆల్రెడీ విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకాదరణ దక్కిందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమా తెలుగు హక్కులను ప్రతాని రామకృష్ణ గౌడ్ సొంతం చేసుకున్నారు. ''ప్రేమ, యాక్షన్ అంశాలతో రూపొందిన సినిమా ఇది. మూడు వేరియేషన్స్ ఉన్న పాత్రలో లక్ష్మీ రాయ్ అద్భుతంగా నటించారు. డ్రగ్స్ సప్లై చేస్తూ కాలేజీ అమ్మాయిల జీవితాలతో ఆడుకునే ఓ ముఠా ఆటను అడ్డుకునే పవర్‌ఫుల్ ఝాన్సీ పాత్రలో లక్ష్మీ రాయ్ నటించారు. ఫైట్ మాస్టర్ థ్రిల్లర్ మంజు కంపోజ్ చేసిన 8 ఫైట్స్ లక్ష్మీ రాయ్ కెరీర్లో మైలు రాయిగా నిలిచిపోతాయి. త్వరలోనే ట్రైలర్‌ను రిలీజ్ చేసి, సినిమాను నవంబరులో రిలీజ్ చేస్తాం'' అని ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు.

మహాకాళి

ఫస్ట్ ఫిమేల్ సూపర్ హీరో


● మహాకాళి పోస్టర్

దర్శక-నిర్మాత-కథారచయిత ప్రశాంత్ వర్మ నేతృత్వంలోని 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్' నుంచి రానున్న కొత్త చిత్రానికి 'మహాకాళి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రివాజ్ రమేష్ దుగ్గల్ ఈ సినిమాను నిర్మించనున్నారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ కథ, స్క్రీన్‌ప్లేతో దర్శకురాలు పూజా అపర్ణ కొల్లూరు ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా గురువారం 'మహాకాళి' సినిమాను ప్రకటించి, ఈ సినిమా పోస్టర్, గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ''భారతదేశం నుంచి వస్తున్న ఫస్ట్ ఫిమేల్ సూపర్ హీరో ఫిల్మ్ 'మహాకాళి'. మా యూనివర్స్‌లో మోస్ట్ ఫిరోషియస్ సూపర్ హీరో మూవీ. బెంగాల్ నేపథ్యంలో అక్కడి సంస్కృతి, సంప్రదాయాలతో ఈ సినిమా ఉంటుంది. భారతీయ మహిళల వైవిధ్యాన్ని, వారి అచంచలమైన స్ఫూర్తిని సెలబ్రేట్ చేసుకునేలా ఈ చిత్రం ఉంటుంది. సాధికారత, విశ్వాసం, అద్భుతమైన ప్రయాణం వంటి అంశాలను ప్రతిబింబిస్తుంది. కాళీ దేవి ఉగ్రరూపం, దయగల స్వభావం ఈ సినిమాలో కనిపిస్తాయి. ఈ సినిమాలోని నటీనటులు, సాంకేతిక నిపుణులను త్వరలో వెల్లడిస్తాం. భారతీయ భాషలతో పాటు విదేశీ భాషల్లోనూ రిలీజ్ చేస్తాం. ఐమాక్స్ 3డీ వెర్షన్ రిలీజ్ కూడా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: స్మరణ్ సాయి.

కామెడీ డ్రామా షురూ


● రానా, టీనా శ్రావ్య, తిరువీర్

తిరువీర్ హీరోగా నటించనున్న కొత్త చిత్రానికి 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' అనే టైటిల్ ఖరారైంది. ఈ చిత్రంలో టీనా శ్రావ్య హీరోయిన్‌గా నటించనున్నారు. రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వంలో సందీప్ అగరం, అష్మితా రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి సందీప్ అగరం కెమెరా స్విచ్చాన్ చేయగా హీరో-నిర్మాత రానా దగ్గుబాటి క్లాప్ ఇచ్చారు. రాహుల్ శ్రీనివాస్ గౌరవ దర్శకత్వం వహించారు. నవంబరులో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు రాహుల్ మాట్లాడుతూ- ''కామెడీ డ్రామాగా ఈ సినిమా ఉంటుంది. నవంబరు 7న వైజాగ్, ఎస్. కోట లొకేషన్స్‌లో ఈ మూవీ షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు. ''ఓ కొత్త పాయింట్‌తో రాహుల్ ఈ సినిమా కథను చెప్పనున్నారు'' అని పేర్కొన్నారు నిర్మాతలు సందీప్ - అష్మిత. రోహన్ రాయ్, నరేంద్ర ఇతర కీలక పాత్రల్లో నటించనున్న ఈ చిత్రానికి సంగీతం: కల్యాణ్ నాయక్.

పాంచ్ పటాకా


● మహేశ్ రెడ్డి, రామ్ నందా

తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి హెచ్‌ఎన్ క్యూబ్ ప్రొడక్షన్ అనే నూతన నిర్మాణ సంస్థ ఎంట్రీ ఇచ్చింది. ఎంట్రీ ఇవ్వడమే పాంచ్ పటాకాలా ఐదు సినిమాలు ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎన్ క్యూబ్ ప్రొడక్షన్ లోగో, మోషన్ పోస్టర్‌ను ప్రముఖ వ్యాపారవేత్త మహేశ్ రెడ్డి లాంచ్ చేశారు. హిమ నందా గజా సమర్పణలో రామ్ నందా దర్శక, నిర్మాతగా హెచ్‌ఎన్ క్యూబ్ ప్రొడక్షన్‌లో వరుసగా ఐదు చిత్రాలు రానున్నాయి. ఈ ప్రొడక్షన్ లాంచ్ కార్యక్రమంలో రామ్ నందా మాట్లాడుతూ- ''రియల్ ఎస్టేట్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చాను. 2002 నుంచి సినిమా రంగంలో ఉన్నాను. నా కుటుంబం మొత్తాన్ని సూచించేలా హెచ్‌ఎన్ క్యూబ్ లోగోని నేనే రూపొందించాను. ప్రస్తుతం మా ప్రొడక్షన్ నుంచి ఐదు చిత్రాలు (ప్రేమలు- పెళ్లిళ్లు, మనసు, ఎల్‌ఎస్‌ఎల్‌ఎమ్, గతి, రామున్ని నేనే- రావణున్ని నేనే) రానున్నాయి. అన్ని చిత్రాల కథలు సిద్ధంగా ఉన్నాయి. ఐదు సినిమాలు ఒకేసారి చేసేంత డబ్బు లేదు. ఒక సినిమా తర్వాత ఇంకోటి చేస్తాను. 'ప్రేమలు-పెళ్లిళ్లు'ని ముందుగా సెట్స్ మీదకు తీసుకొస్తాను. ఇందులో కొత్తవారు నటిస్తారు'' అన్నారు.

ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్


● నేహా, రాహుల్

'రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా నటిస్తున్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్'. అశోక్ రెడ్డి కడదూరి దర్శకత్వం వహిస్తున్నారు. 'డియర్ మేఘ, 'భాగ్ సాలే' వంటి వైవిధ్యమైన సినిమాలు నిర్మించిన వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్‌పై అర్జున్ దాస్యన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ని హీరో-నిర్మాత రానా దగ్గుబాటి విడుదల చేసి, 'టైటిల్ ఆసక్తిగా ఉంది... సినిమా సక్సెస్ అవ్వాలి'' అని ఆకాంక్షించారు. ''పూర్తి స్థాయి వినోదాత్మకంగా అశోక్ రెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. నూతన దర్శకుడైనా అనుభవం ఉన్నవాడిలా తీర్చిదిద్దుతున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. అజయ్ ఘోష్, మురళీధర్ గౌడ్, గెటప్ శ్రీను, రచ్చ రవి, రవి వర్మ, గంగవ్వ, జయశ్రీ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకి కెమెరా: కార్తీక్ కొప్పెర, సంగీతం: సురేష్ బొబ్బిలి.